ఆదివారం
ప్రజాశక్తి
డిసెంబర్ 22, 2002

మెర్రీ క్రిస్మస్

హ్యాపీ బర్త్‌డే

(22-12-2002 నుండి 28-12-2002 వరకు)

సురాగ, సునీష
2సం,22. 12. 2000, 8సం॥22.12.1996
జీవనజ్యోతి-నరేందర్
మెడ్చెల్-రంగారెడ్డి



పి. సుస్మిత
2సం,22. 12. 2000
సువర్ణ-అంబన్నాచారి
గోరెబాళ-కర్ణాటక

భార్గవ్ కుమార్
5సం॥, 23.12.1997
దుర్గాభవాని-వీరరాఘవయ్య
కాకినాడ-తూ॥గో

మహేశ్వరి
2సం॥, 23.12.2000
నర్సమ్మ-రవి
చిలమామిడి-మెదక్

పఠాన్ ఇరాద్ ఖాన్
1సం॥, 24.12.2001
ఆశా-ఖాజామొద్దిన్
ఇంకొల్లు-ప్రకాశం

పి. శ్రీలత
డిసెంబర్,25
జయమ్మ-రామాంజనేయులు
శాంతినగర్-కడప

యర్రంశెట్టి శ్రావణి
డిసెంబర్,25
తులసి-నారాయణ
బంజారాహిల్స్-హైదరాబాద్

చంద్రిక
1సం॥, 25.12.2001
రాధ-బాలరాజు
నాగర్‌కర్నూలు-మ॥నగర్



ఎల్. శివజగదీష్
4సం॥, 26.12.1998
పద్మావతి-విజయభాస్కర్
వనపర్తి-మ॥నగర్

కె. మీన
10సం॥, 26.12.1992
ఉమాగౌరి-మల్లిఖర్జునాచారి
పెరుముళ్లపల్లి-చిత్తూరు

వై. జాహ్నవి
2సం॥, 27.12.2000
సునీత-రామనాథం
పంగూరు-చిత్తూరు

ఎన్.వి.ఎస్.వి. అలేఖ్య
9సం॥, 28. 12. 1993
వనజ-దీక్షితులు
పామూరు- ప్రకాశం

ఎమ్.సోనీ
3సం॥, 28.12.1999
ఉమారాణి-అశోక్‌కుమార్
బూర్గుల-మ॥నగర్

కణాల నిర్మూలనకు లేదా క్యాన్సర్‌వల్ల కలిగే లక్షణాలనుంచి ఉపశమనం కలిగించే కీమోథెరపీ వాడుతారు.

కీమోథెరపీ దశలవారీగా అమలుచేస్తారు. ఒక దశలో చేసిన చికిత్స ఫలితాలను బట్టి 2వ దశ అమలు చేస్తారు. సుమారుగా 6నెలలపాటు ఈ చికిత్సా విధానం ఉంటుంది. 3నెలలనుంచి 4 నెలలవరకు చికిత్స పొడిగించవచ్చు. సర్జరీతో క్యాన్సర్‌ను తొలగించిన తరువాత కీమోథెరపీ చేస్తే క్యాన్సర్ పునరావృత్తి చెందే అవకాశాలు తగ్గుతాయి.

రోగులకోసం :

క్యాన్సర్ రోగులు డాక్టర్‌ను ఈ క్రింది ప్రశ్నలువేసి సమాధానాలను రాబట్టి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

మీరు డాక్టర్ వద్దకు వెళ్ళేటప్పుడు ప్రశ్నవేసి మీకు లభించబోయే చికిత్స, దాని ఫలితాలు గురించి తెలుసుకోవటం మంచిది.

- నాకు ఎటువంటి క్యాన్సర్‌లు ఉన్నాయి? అవి ఏ దశలో ఉన్నాయి?
- మీ అభిప్రాయం ప్రకారం రుగ్మతస్థితి ఎలా ఉంది?
- మీరు ఏవిధమైన చికిత్సా విధానాన్ని సిఫారసు చేస్తున్నారు?
- ఎందుకని ఈ విధానం సిఫారసు చేశారు?
- మీరు అమలుచేసే చికిత్స లక్ష్యం ఏమిటి? రోగనివారణా లేక ఉపశమనమా?
- చికిత్సవల్ల కలిగే దుష్ప్రభావాలు లేదా అవాంఛనీయ పరిణామాలు ఏమిటి?
- ఇతర చికిత్సా విధానాలు ఏమైనా ఉన్నాయా?
- చికిత్సకు కాని, పరీక్షలకు కాని నేను ఎప్పుడెప్పుడు రావాలి?
- చికిత్స ఎంతకాలం పడుతుంది?
- ఒకవేళ చికిత్సలో అంతరాయం కలిగితే ఏమవుతుంది?
- నా జీవితం మెరుగవుతుందా?
- నా విధి నిర్వహణలో, సంసార జీవితంలో విశ్రాంతి సమయాలలో ఏరకమైన మార్పులు అవసరం?
- నేను వేసుకోవలసిన మందుల పేర్లు ఏమిటి? అవి ఏం పనిచేస్తాయి?
- ఇతరత్రా మందులు వేసుకోవాలా? ఇతర చికిత్సలు అవసరమా?
- మీరు చేసిన చికిత్స పని చేస్తున్నదీ, లేనిదీ ఎలా తెలుసుకుంటారు?
- రక్త పరీక్ష అవసరమా? ఎన్నిసార్లు? ఇతర వైద్య నిపుణులు కూడా నా రోగనివారణ ప్రక్రియలో పాలుపంచుకుంటే వారందరినీ మొత్తం చికిత్సా పద్ధతులను సమన్వయ పరచేవారు ఎవరు?
- నా వ్యాధికి సంబంధించి ఎటువంటి లక్షణాలు లేదా సమస్యలను మీకు తెలియజేయాలి?
- ఒకవేళ నేను అస్వస్థతకు గురైతే మీరు అందించే చికిత్స పనిచేయనట్లేనా?
- క్యాన్సర్ చికిత్స తరువాత కూడా నాకు సంతానం కలిగే అవకాశం ఉంటుందా?
- నేను సేవించదగిన, తినదగిన ప్రత్యేక ఆహారం ఏమైనా ఉందా?
- నా చికిత్సకు ఖర్చు ఎంతవుతుంది? మిమ్మల్ని ఏదైనాఅడగాలనుకుంటే సరియైన సమయం ఏమిటి?

ఈ ప్రశ్నలన్నీ వేసి సమాధానాలు తెలుసుకొని మీ సందేహ నివృత్తి చేసుకోండి. అనుమానం చిన్నదైనా అడగవచ్చు. స్పష్టమైన సమాధానం రాబట్టండి. ★

చర్మ క్యాన్సర్ నిరోధానికి లెమన్ టీ

వేడి వేడిగా టీ తాగితే శరీరం నిద్రాణ స్థితిలో నుండి ఉత్తేజం పొందుతుంది. కాని ఆ టీలో పాలు కాకుండా నిమ్మకాయరసం కలుపుకుని తాగితే చర్మానికి వచ్చే క్యాన్సర్‌ను నిరోధిస్తుంది.

ఒకరకమైన స్కిన్ క్యాన్సర్‌తో బాధపడే 450 మంది రోగులను పరీక్షించగా వేడి తక్కువగా వుండే టీ తాగిన కారణంగానే వీరికి క్యాన్సర్ సోకినట్లు వెల్లడయ్యింది.



అయితే బ్లాక్ టీలో నిమ్మరసం కలిపి తాగితే మరింత మేలు చేకూరుతుంది. చర్మానికి సోకే క్యాన్సర్ తగ్గుతుంది. నిమ్మకాయకు చర్మంలో పుట్టకురుపు కణాలను తగ్గించే గుణం 70 శాతం ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. మామూలు బ్లాక్ టీలో క్యాన్సర్ నిరోధక గుణాలు 40 శాతం వున్నాయి. స్కిన్ క్యాన్సర్ నిరోధానికి పోషక విలువలుగల అదనపు ఆహారం దోహదం చేస్తుందని అరిజోనా యూనివర్శిటీకి చెందిన పరిశోధన బృందం ఐమాన్‌హాకిమ్, రాబిన్ హారిస్ అన్నారు. అయితే స్కిన్ క్యాన్సర్ నిరోధానికి, నివారణకు లెమన్ టీ కన్నా, సన్‌స్క్రీన్ వాడటం ఉత్తమమని, స్కిన్ క్యాన్సర్ బాధితులు ఎండలలో తిరగడం తగ్గించాలని కాన్సర్ రీసెర్చి క్యాంపెయిన్‌కి చెందిన సైన్స్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ బ్రాడ్ థావుస్ అన్నారు. గ్రీన్ టీ, బ్లాక్ టీ కూడా నీలలోహిత కిరణాల వల్ల చర్మం కమిలిపోవడం, స్కిన్ క్యాన్సర్‌ను నిరోధించే గుణాలున్నాయనడానికి రుజువులు లభించాయి. అయితే వేడి వేడి పానీయాల వల్ల కలిగే ఉపశమనం శీతల పానీయాల వల్ల లభించదని శాస్త్రజ్ఞులు అంటున్నారు. ఈ పరిశోధనలు మరింత కొనసాగవలసి వుంది. స్కిన్ క్యాన్సర్‌కు రక్షణ కవచంగా గ్రీన్ టీ ఎంతవరకు ఉపయోగపడుతుందన్న అంశంపై మానవులపై పరిశోధనలు జరగవలసి వుంది. ★

సీనియర్ సిటిజెన్స్

అంపశయ్య నవీన్

"మన ఎస్సీల సంఖ్య పెరిగిపోతున్నదండోయ్?" అన్నాడు మిత్రుడు భాస్కర్రావు.

భాస్కరరావు పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్‌గా పని చేసి ఈ మధ్యనే రిటైర్ అయ్యాడు. ఓ దగ్గరి మిత్రుడు గుండెపోటొచ్చి చనిపోతే మేమందరమూ అతని అంతిమయాత్రలో వెళ్తుండగా భాస్కరరావీమాటన్నాడు.

"మన ఎన్.సీ.ల సంఖ్య పెరిగిపోతున్నదంటున్నారు. మనందరం ఎస్.సీలమని మీ అభిప్రాయమా?" అన్నాను నేను. "అవును. మనం ఎస్.సీలమేగదా!" అన్నాడు భాస్కరరావు.

"మనం ఎన్.సీలమెప్పుడయ్యాం?" అన్నాను నేను.

"ఎప్పుడో అయ్యాం. మీకా విషయం ఇంకా తెలియదా?"

"ఎన్.సీలంటే ఆయన ఉద్దేశం మీరనుకుంటున్నట్టుగా షెడ్యూల్డుకేస్ట్స్ అని కాదు – సీనియర్ సిటిజెన్స్‌మని" అన్నాడు మాతోబాటు నడుస్తున్న మరో మేధావి మిత్రుడు ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి.

"ఎస్.సీలు గీస్సీలని ఎందుకు కొత్తపేర్లు పెద్తారు. ముసలివాళ్ళ సంఖ్య పెరిగిపోతున్నదందురూ?" అన్నాడు అక్కడే ఉన్న మరో కవి మిత్రుడు మురళీధర్.

దాంతో అందరూ ఈ దేశంలో సోకాల్డ్ సీనియర్ సిటిజెన్స్ లేక ముసలివాళ్ళ సంఖ్య పెరిగిపోవడం గురించి మాట్లాడటం మొదలెట్టారు.

నిజమే. ఈ దేశంలో అరవయ్యేళ్ళు పైబడిన వాళ్ళ సంఖ్య పెరిగిపోతున్నది. మనం చిన్న వాళ్ళుగా ఉన్న రోజుల్లో అరవయ్యేళ్ళొచ్చాయంటే అతన్ని కాటికి కాళ్ళు చాపుకొని ఉన్న వ్యక్తిలాగే చూసేవాళ్ళు. అరవయ్యేళ్ళొచ్చిన వాళ్ళ శరీరాల్లో కూడా చాలా మార్పులొచ్చేయి. ముఖమంతా ముడతలు పడిపోవడం, పళ్ళూడిపోవడం, కాళ్ళు పూర్తిగా బలహీనమైపోయి అస్సలు నడవలేకపోవడం, నడుం వంగిపోవడం లాంటివన్నీ ఓల్డ్ పీపుల్‌కొస్తుండేవి. ఆడవాళ్ళయితే యాభయ్యేళ్ళు దాటాయంటే వాళ్ళను ముసలివాళ్ళకిందే జమకట్టేవాళ్ళు – వాళ్ళు కూడా ముసలివాళ్ళలాగే కనిపించేవాళ్ళు. ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇవ్వాళ్ళ అరవయ్యేళ్ళు దాటిన వాళ్ళు కూడా పాతికేళ్ళ కుర్రాళ్ళలాగ కనిపిస్తున్నారు. తలవెంట్రుకలకు నల్లరంగు వేసుకున్నారంటే వాళ్ళ వయస్సెంతో కరెక్ట్‌గా ఊహించడం చాలా కష్టమైపోతుంది. – వైద్యరంగంలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పుల కారణంగా చాలా జబ్బులను నయం చెయ్యగలుగుతున్నారు. అనేక విటమిన్లు వాడటం కారణంగానూ, ఆహారం తీసుకోవడంలో జనం అనుసరిస్తున్న పద్ధతుల కారణంగానూ వయస్సు వల్ల శరీరంలో వచ్చే మార్పుల్ని కూడా ఆపగలుగుతున్నాం... ఈ కారణాల వల్ల ఇవ్వాళ్ళ సీనియర్ సిటిజెన్స్ సీనియర్ సిటిజెన్స్‌లాగ కనిపించడం లేదు" అన్నాన్నేను.

"ఇవ్వాళ్ళ హెల్త్ కాన్సియస్‌నెస్ – ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే చైతన్యం పట్టణ ప్రాంతాల్లో బాగా పెరిగిపోయింది. రోజూ ఉదయమే వాకింగ్ చేసే వాళ్ళ సంఖ్య బాగా పెరిగిపోతున్నది. ఇంట్లో ఉండికూడా చాలా మంది రకరకాల ఎక్సర్‌సైజులు చేస్తున్నారు. తిండి విషయంలో కూడా ఏ ఆహార పదార్థంలో ఎన్ని కాలరీలుంటాయో, ఏఏ విటమిన్లుంటాయో తెలుసుకొని చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ కారణాల వల్ల ఓల్డేజిని కొంతమేరకు వాయిదా వెయ్యగలుగుతున్నారు" అన్నారు భాస్కరరావు.

"మనల్నే తీసుకోండి – మనల్ని చూస్తే ఎవరన్నా మనం అరవయ్యేళ్ళ పైబడిన వాళ్ళమనుకుంటారా? మరీ మన భాస్కర్రావైతే పాతికేళ్ళ కుర్రాడే అనుకుంటారు" అన్నాడు మురళీధర్.

"మీరు మాట్లాడేది పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న మనలాంటి బాగా డబ్బున్న వాళ్ళను గురించి... కానీ పల్లెటూళ్ళకు వెళ్ళి చూడండి – పల్లెటూళ్ళల్లో నివసిస్తున్న వాళ్ళల్లో అరవయ్యేళ్ళు దాటిన వాళ్ళను చూడండి. వాళ్ళు ముసలి వాళ్ళలాగే కనబడ్తారు. మన దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా డెబ్బై లేక ఎనభయ్యేళ్ళు దాటిన వాళ్ళ సంఖ్య విపరీతంగా పెరిగిపోతున్న మాట వాస్తవమే. మొత్తం జనాభాలో వీళ్ళ శాతం త్వరలోనే ఇరవై, ఇరవై ఐదు దాటిపోవచ్చునంటున్నారు... బాగా అభివృద్ధి చెందిన దేశాల్లోనయితే ఆ సీనియర్ సిటిజెన్స్‌కు వాళ్ళ చివరి రోజుల్లో వాళ్ళు ప్రశాంతంగా జీవనాన్ని సాగించడానికి కావలసిన సౌకర్యాలన్నీ ఉన్నాయి. కానీ మన ఇండియా లాంటి అత్యధిక జనాభా కలిగిన దేశాల్లో అట్లాంటి పరిస్థితి లేదు. మన దేశంలో వృద్ధుల ఆశ్రమాల్ని ఏర్పాటు చెయ్యాలనే కాన్‌సెప్టే లేదు. అందుకే చాలా మంది వృద్ధులు తమ పిల్లల మీదనే ఆధారపడ్తున్నారు. తమ వృద్ధ తల్లిదండ్రుల్ని ప్రేమగా చూసుకునే పిల్లలెంతమందుంటారు? అందువల్ల మనదేశంలో వృద్ధుల పరిస్థితి చాలా దయనీయంగా మారిపోతున్నది" అన్నాడు భాస్కరరావు.

సమస్యేమిటంటే మనమీద ఆధారపడి బతికే వాళ్ళంటే... ముఖ్యంగా ఆర్థికంగా మన మీద ఆధారపడేవాళ్ళంటే మనకు చిన్నచూపు ఏర్పడుతుంది. ఆర్థికంగా మన మీద ఏ మాత్రం కూడా ఆధారపడకుండా బతుకుతున్నంత వరకు మనం మన తల్లిదండ్రుల్ని బాగానే చూసుకుంటాం.... ముసలివాళ్ళయిపోతున్న కొద్దీ వాళ్ళు ఆర్థికంగానే కాకుండా ఇంకా అనేక విధాలుగా మన మీద ఆధారపడేటప్పటికి వాళ్ళను వాళ్ళ పిల్లలు చీదరించుకోవడం మొదలెడ్తారు... మంచంలో పడిపోయి లేవలేని పరిస్థితి ఏర్పడిందంటే వాళ్ళ పరిస్థితి మరీ దయనీయంగా మారిపోతుంది. అందుకని సీనియర్ సిటిజెన్స్‌ను ఆదుకోవడానికి ప్రభుత్వం అనేక సదుపాయాల్ని కల్పించాలి. చివరి రోజుల్లో వాళ్ళ బ్రతుకు దుర్భరం కాకుండా చూడాలి. విదేశాల్లో ముఖ్యంగా కొన్ని అభివృద్ధి చెందిన దేశాల్లో సీనియర్ సిటిజన్స్‌ని చాలా ప్రేమగా చూసుకునే వ్యవస్థలున్నాయి. అవి మన దేశంలో కూడా ఏర్పడేలా చూడాలి" అన్నాన్నేను.

"మన దేశంలోనా? మన దేశంలో సీనియర్ సిటిజెన్స్‌ని గౌరవంగా బతకనిచ్చే పరిస్థితులు ఏర్పడటం అసాధ్యం. రిటైర్ అయిన వాళ్ళకిచ్చే పెన్షన్స్‌నే ఆపేస్తామంటున్నారు.. ఆల్‌రెడీ పెన్షనర్స్‌కిచ్చే డి.ఏ.ను ఆపు చేశారు కదా... సీనియర్ సిటిజెన్స్ సంఖ్య విపరీతంగా పెరిగిపోతున్న మాట నిజమేగానీ వాళ్ళకు ఓల్డేజిలో ఎదురయ్యే సమస్యల్ని ఎదుర్కోవడంలో మాత్రం మన ప్రభుత్వాలు ఘోరంగా విఫలమైపోతున్నాయి" అన్నాడు భాస్కరరావు.

★

-టిప్పు-ఆరు తేడాలు





నేస్తాయ్...

పై బొమ్మలో రెండు ఏనుగు పిల్లలున్నాయి రా. వాటి పేర్లు అప్పు, టిప్పు. భలే ముద్దుగా వున్నాయి మరేంటనుకున్నారు. తమ అడవిలో జరిగే ఓ పెళ్లికి కావడం కోసం చక్కగా ఒకేలా తయారయ్యాయి. వాటి అలంకరణలో ఆరు తేడాలున్నాయి. అవేంటో కండి చూద్దాం.

కలం స్నేహం

ి.ఎమ్.ప్రవీణ్

: 12 సం॥

: 7 వ తరగతి

: క్రికెట్ ఆడడం, పేపరు చదవడం

రునామా :

ప్రవీణ్, సన్నాఫ్ టి.ఐ. ప్రతాప్, ఇంటినెంబరు 8/109,

. కనిగిరి.

ం. సాయి సిద్ధార్థ

:5 సం॥

యుకెజి

డాన్స్ చేయడం, టీవీ - సినిమాలు

ినామా :

ం.గణేష్,

ంబరు 1-3-176/4/సి/1,

కాలనీ, గాంధీనగర్, హైదరాబాదు.

కితకితలు

నసీరుద్దీన్ ధైర్యాన్ని పరీక్షించాలన్న కోరిక కలిగింది రాజుగారికి. ఓసారి ఏదో చిన్న విషయానికే బాగా కోపం తెచ్చుకుని 'నసీరుద్దీన్‌ని తక్షణమే ఉరితీయండి' అని ఉత్తర్వులు జారీ చేశాడు. భటులు వెంటనే నసీరుద్దీన్‌ని ఉరికంబం దగ్గరకు తీసుకెళ్లి తలకు ఉరితాడు బిగించే ప్రయత్నాలు చేస్తున్నారు. సరిగ్గా అప్పుడు రాజుగారు అక్కడకు వచ్చారు. నసీరుద్దీన్‌వైపు చూస్తూ 'ఏమయ్యా... నసీరుద్దీన్! ఈ చివరి క్షణాల్లో ఏమన్నా చెప్పుకోదలచుకున్నావా' అన్నాడు.

దానికి నసీరుద్దీన్ గాభరాగా 'మహారాజా! వుంది' అన్నాడు.

'వుంటే ఏమిటో చెప్పు. త్వరగా' అన్నాడు రాజు.

'నా మెడ ఎవరైనా ముట్టుకుంటే కితకితలు పుడతాయి. వాటిని నేను భరించలేను. కనుక మెడకు బదులుగా నా నడుముకి ఉచ్చు వేసి ఉరితీయండి. అదొక్కటే నేను కోరుకునేది' అన్నాడు నసీరుద్దీన్.

నసీరుద్దీన్ తెలివికి రాజు ఎంతో సంతోషించి ఉరితీయకుండా వదిలిపెట్టాడు.

మేజిక్! మేజిక్!!

హాయ్...

నాకు బోలెడన్ని మేజిక్‌లొచ్చు. కావాలంటే మీకూ నేర్పిస్తా. కానీ ఒక్క షరతు. అదేంటంటే.... మీరు వారం వారం తప్పనిసరిగా బాలనేస్తాలు పేజీ చదవాలి. ఇంకా...అందులో మీకు నచ్చిన శీర్షికలలో పాల్గొనాలి. మాకు ఉత్తరాలు రాయాలి. అంతే. మరి మన ఒప్పందం ప్రకారం ఇవాల్టి మేజిక్ ఏంటంటే.... పక్కన ఒక అమ్మాయి బొమ్మ వుంది చూడండి. ఆ అమ్మాయిని ముసలమ్మలా చేసెయ్యొచ్చు. కానీ దానికి ఒక మంత్రం చదవాలి. అదేంటంటే 'అబ్రకదబ్రా... అబ్రకదబ్రా... అమ్మాయి దబ్రా, ముసలమ్మ దబ్రా...' అంటే చాలు. ఆ అమ్మాయి ముసలమ్మ అయిపోతుంది. కాకపోతే పేజీని అటు తిప్పి చూడాలి. ఓకేనా. మంత్రం మాత్రం జాగ్రత్తగా గుర్తు పెట్టుకోండి. మీ స్నేహితులకు ఈ అమ్మాయి బొమ్మ చూపించండి. మంత్రం వేసి ఆమెను ముసలమ్మగా మారుస్తానని చెప్పండి. ముఖ్యమైన విషయమేంటంటే 'అబ్రకదబ్రా... అబ్రకదబ్రా... ' అనేటప్పుడే మీ ఫ్రెండుని కళ్లు మూసుకోమని చెప్పాలి. ఆమె కళ్లు తెరచేలోపు... మంత్రం చదువుతూనే పేజీ అటు తిప్పేసెయ్యండి. ముసలమ్మ కనిపిస్తుంది. చూశారా... మన ఒప్పందం ప్రకారం ఇవాళ మీకు మంచి మేజిక్ నేర్పించాను. మరి మీరు ఏ శీర్షికలో పాల్గొంటారో... నిర్ణయించుకుని ఉత్తరం రాస్తారుగా.

ఇంద్రుడికో చంద్రుడి నూలుపోగు

రుక్మిణి

బాబుగారు యమహా హైరానా పడిపోతున్నారు. ఒకటే పలవరింతలు.. ఎవరికీ ఏం పాలుపోక జుత్తు పీక్కుంటున్నారు. కొందరు అధైపోయింతర్వాత అధికార్ల మీద ఎగిరెగిరి పడుతున్నారు. మంత్రులూ... యమ్మెల్లేలు... "దీనిక్కారణం ఎవరు.. ఎవరి దుమ్ము దులపాలా?" అన్న తర్కంతో తన్నుకుంటున్నారు.

"బ్రహ్మపుత్ర... గంగా.. కావేరీ... యమునల సమాగమం తప్పదు గాకతప్పదు – వాటన్నిటినీ ఏకతాటితో బిగదీసి ఒకే 'కెనాల్' ఏర్పాటు చేస్తేగానీ ఈ పుణ్యభూమికి జలగండం తప్పదు" బాబుగారు ఓ కేక పెట్టి తమకంలోకి జారినట్లు కండ్లు మూసుకున్నాడు.

"ఉన్న ప్రాజెక్టుల కింద నాట్లేసిన పొలాలు నిక్కి నీలుగుతున్నాయని రైతులు ఆరాటపడి పోరాటాల్లోకి దిగిపోయేట్లున్నారు. రాస్తారోకోల దాకా వచ్చింది. శాంతి భద్రతలనీ.. జాతీయ క్రీడలనీ మన పోలీసు బలగం అదుపు చేస్తూనే వున్నారు – లాఠీల దాకా కూడా వచ్చిందాయె!" మంచం దగ్గిర చేరిన సీనియర్ మంత్రి సీరియస్‌గా తాను చెప్పదలుచుకున్న నాలుగు ముక్కలు చెప్పి ముక్కి మూలిగాడు.

"నర్మదా... తపతీ... సయాజ్... బిట్లస్... రావీ... సరస్వతీ నదుల్ని వెంటనే ఏకం చేయాలె! దేశంలో జలసంపదకు కొదవ లేదు. అది అన్ని చోట్లా ఒకే తీరున పారటం లేదు. కొన్ని రాష్ట్రాలు నీళ్ళు లేక అలమటించడానికి వీల్లేదు!" మరో కేక పెట్టి ఎగశ్వాస పీల్చి బాబు గారు కండ్లు మిటకరించాడు.

"మొత్తానికి మొత్తం చిన్న చెరువులు ఎండకపోయి బీటలు బాసి నెర్రలేసినై! వాటి సంగతేంటోగానీ పెద్ద చెరువులన్నీ అడుగంటి పాయె! తాగునీళ్ళకు తిప్పలు తప్పవాయె! జనాలు ఖాళీ బిందెల దరువులు మోగిస్తూ మనల్ని తిట్లూ... శాపనార్థాలతో కలిసి పాటలు కట్టి బజానే చేసేటట్లుంది. మన రాజధాని సంగతే రాజుకుంటుంది. ఈ టాంకర్లు లాభం లేదు.... ఎయిద్దని ఎంత భయపెట్టినా ఎవడూ ఆగటం లేదు – మంచి నీళ్ళో... చెరువులో... ప్రాజెక్టులో... గోల....

"క్రిష్ణా... పెన్నా... గోదావరి... స్వర్ణముఖీ... సింధూ.. అన్ని నదుల్ని కలిపి సంగమం చేస్తే గానీ ఈ దేశానికి జలదరిద్రం తీరదు.... కేంద్రం వెంటనే నడుం బిగించాలె... సర్వేలు జరిపించడానికి విదేశీ కన్సెల్టెన్సీలను నియమించి... 'కమీషన్లు' ఏర్పాటు చేయాలె...

బాబుగారు చాలా ఉద్రేకపడి... నీరసం వచ్చి గటగట పెద్ద గ్లాసెడు నీళ్ళు తాగి అయోమయంగా చూశాడు. అప్పటికే మంత్రులు.. ఎమ్మెల్లేలు అధికార్లను 'నీళ్ళ గురించి నిలదీయడం... వాళ్ళు నీళ్ళు నమలడం' జరిగిపోయి, నిలబడి చూస్తుండి పోయారు. ఏది దారి? ఏ మీటలు నొక్కితే నీటి ధార ఊడిపడుతుందో ఏ నిపుణుడూ చెప్పకపాయె!

"బోరుబావిల వన తీరిపోయింది – వచ్చేది గడ్డుకాలం... ఇంకుడు గుంతలంటే జనాలు ఇంతెత్తున ఎగిరిపడుతున్నారు. లాభం లేదు – భూగర్భ జలాలకు మరేదైనా పథకం పకడ్బందీగా అమలు చెయ్యాలె!"

ఓ మంత్రిగారు చాలా విచారంగా అన్నాడు. "అవునూ గొట్టాలు పెట్టి సముద్రం నుండి భూమిలోపలికి నీటిని ఎగదోసే పథకం ఏదైనా ప్రపంచ బ్యాంకోడి బుర్రలో వుండేమో"... ఒక ఎమ్మెల్యే నోరు తెరిచి అనేంతలో అందరూ అతనిమీద అంతెత్తున ఎగిరిపడ్డారు.

"చాలు బ్యాంకు సంబడం... పైపై సంగతులకే పటారం పగిలిపోతుంటే భూమి లోపలి దాకా పోతే మన లొటారం ఊడిపోతుంది. చాలు! అసలు ఈ నీళ్ళ కోసం ఏదైనా దేశానికి ఆర్డరు పారేస్తే.. వాళ్ళే చూసుకుంటారు గదా!"

ఎటూ తేలక అందరూ చింతాక్రాంతులై వున్న సమయంలో ఒక పార్టీ 'దళపతి' ఉరుకులు పరుగులతో వచ్చి పంచదార వంటి ప్లాను ఒకటి పడేయడంతో అందరూ తేరుకుని ఆలోచనల్లో పడ్డారు–

"వరుణుడి కరుణ... దాని కోసం ఏం చేయాలో మీరెవరూ ఆలోచించడం లేదు– మనలో ఎవరైనా వేదాలూ... మంత్రాలూ చదివుంటే ఇట్లాంటి ఆపద సమయంలో అక్కరకు వచ్చేవి," దళపతి మాటలతో వాళ్ళ బుర్రలు మళ్ళా వేడెక్కాయి–మంత్రాలు... చింతకాయలంటాడేంటి? ఉన్న కంప్యూటర్ల వూదర చాలకనా?

"ఇంద్రుడికో నూలుపోగు... గ్రహాలు... జాతకాలు నమ్మకపోవడం వల్లనే ఈ తిప్పలంతా... నాకు తెలిసిన ఆసామీ 'సభాపతి'... అబ్బో అఖండుడు... రత్నం... చెన్నయ్‌లో మకాం... గ్రహాలూ... చేతులూ చూసి అటు ఏడుతరాలు... ఇటో పదిహేడు తరాలూ రాశీ... జోస్యం చెప్పేయగలడు – ఆయన్ని వెంటనే పిలిపించుకుంటే ఈ దరిద్రం మొత్తం వదిలిపోతుంది మరి!"

ఆ చేతులు చూసే 'గ్రహఫల హస్తజ్ఞాని' యజ్ఞాలు... యాగాలు చేస్తే వానలు కురవడవే గాక వరదలు వచ్చే ప్రమాదం కూడా వుందని వినికిడి – అట్లా

జరిగాయని తొడలు బాగా చరిచి ఓ మంత్రిగారు తన నియోజకవర్గంలో ఆర్భాటంగా ఇంద్రుడి కరుణ కోసం, వరుణుడి వరాల కోసం యజ్ఞాల ఏర్పాట్లకు ముమ్మరంగా తగులుకున్నారు.

★ ★ ★

"మన ఊరు ఊరు మొత్తం జనవంతా ఈ 'జలగ్రహ మహారాశి యజ్ఞం'లో పాల్గొని 'చంద్రుడికో నూలు పోగు'లా... వరుణుడి ప్రసన్నం కోసం... వానల కోసం... చెరువులు నిండడానికీ... వంటలు పండడానికీ... నీళ్ళు తాగడానికీ... అంతా ఆ యజ్ఞం మీదనే భారం వేసి భయం లేకుండా వుండాలె!"

మంత్రిగారి సమాచారంతో జనాలందరూ కొయ్యబారిపోగా వాళ్ళ మెదళ్ళన్నీ మొద్దుబారి పోయాయి.

"వామ్మో... మరి ఈ కరకట్టలు.. ఇంకుడు గుంతలూ... ఎటుపోను... నీటి సంగతులేమాయె!" ముసలి గురివిగాడు తగులుకున్నాడు.

"అబ్బా... వాన కురిస్తే గదా గుంత నిండేదీ... ముంత ముంచేదీ...కురవడానికే మనందరం దీక్షగా పొద్దున్నే తలంట్లు పోసుకునీ...

"అబ్బో... తాగడానికే నీళ్ళు లేవురా తమ్ముడా అంటే... తలంటుకు తాంబూలం తెమ్మన్నాడు.... వామ్మో...!" ముసిలి ఆగమ్మ గొణిగింది!

"ఉపవాన దీక్షతో యజ్ఞగుండం చుట్టూ కూర్చుని కండ్లు మూసుకుని పూజలు చేయాలె... "రోజు కూల్నాలి దొరక్క ఉపాసాలేనాయె! మళ్ళా ఏంది? కండ్లు మూసుకుని, సెవుల్లో బిరడాలు నూక్కునే బతుకుడాయె! ఇంగమేం ఎవుడి కండ్లు మూయాల్నో చెప్పుండి!" జక్కులోడు మటమటలాడుతూ మండిపడ్డాడు.

"అరె... మానవ ప్రయత్నానికి దేవుడు జతపడాలె! ఇపుడు మన ఆరాధ్య దైవం ఇంద్రుడు... ముందు ఇంద్రుడ్ని ప్రసన్నం చేసుకుంటే వారు అర్జంటుగా ఆన్‌లైన్‌లో అటు వాన దేవుడికి ఆదేశాలిచ్చేస్తాడు. ఖతం... వానలే వానలు... ఒరె జక్కులోడా... ఆ వాన దెబ్బకు "బాబోయ్ ఇంద్రుడు గారూ... జరవానలాపండిసారో – వానకు హాలిడే ఇవ్వండో" అని మళ్ళా ఒక యజ్ఞం చేయాల్సొస్తుందిరో"! మంత్రిగారు అందర్నీ ఉబ్బేసి నవ్వించే ప్రయత్నం ఓటి చేశాడు.

"ఇంద్రుడి దాకా ఎందుకూ...? మన చంద్రుడుగారే యజ్ఞమో, యాగమో చేసి పారేసి అటు వరల్డ్ బ్యాంక్ నుండి కుతితీర పీకలోతులో అప్పుల వానలు కురిపించె– కరువు సాయం అని సెంటరు నుండి బియ్యాపో... బియ్యం... వాన–తీరున 'కరువు బియ్యం' మిల్లులకు వరదలా పారించినాడు గదా! థు...హైటెక్... విజన్ 2020.. అరె... మీ ఇండ్లల్లు... బిల్డింగుల మీద కూలబడి మీరు మీ ఓట్ల వానకోసం చేసుకోండి యాగాలు.. యజ్ఞాలు...

జక్కులోడి వాక్ ప్రవాహానికి మంత్రిగారు బిక్కచచ్చిపోయారు. ★

కదలివస్తున్న కడలి తరంగం



రాంప్రసాద్

అంతర్జాతీయ క్రికెట్‌లో ఓ యువతరంగం ప్రస్తుతం అందరిదృష్టినీ ఆకర్షిస్తోంది. ప్రతి ఒక్కరూ అటే ఆసక్తిగా చూస్తున్నారు. పిన్న వయసులోనే అంతర్జాతీయ రంగంలో అడుగుపెట్టడంతోపాటు మేటి క్రీడాకారులను నిబ్బరంతో, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంటున్న తీరు అందరినీ అబ్బురపరుస్తోంది. రానున్న కాలంలో అతడు మరింత ప్రకాశించే అవకాశం ఉంది. ఇంతకు అతడు మరెవరోకాదు భారత వికెట్‌కీపర్‌గా అడుగుపెట్టి జట్టులో అనతికాలంలోనే అందరికీ తలలో నాల్కలా మారిన పార్థివ్‌పటేల్. 17 ఏళ్ల ఈ చిచ్చరపిడుగు గుజరాత్ రాష్ట్రానికి చెందినవాడు. కుంబ్లే వేసిన బంతి తన బ్యాట్‌కు తగిలి వెనక నిరంతరం అప్రమత్తంగా ఉండే పార్థివ్ చేతికి చిక్కుతుంటే చందర్‌పాల్ వంటి అనుభవజ్ఞుడు కూడా నిస్సత్తువగా చూడటం తప్ప ఏమి చేయగలడు? హర్భజన్ బంతి బ్యాట్ అండ్ ప్యాడ్‌కు తగిలి వికెట్‌కీపర్ చేతిలో పడితే రాంనరేష్‌శర్వాణ్ ఆశ్చర్యపడటం మినహా చేయగలిగేదేముంది? కార్తీక్ బంతిని షాట్ కొట్టేందుకు ముందుకు రాగా అదుపుతప్పి పార్థివ్ చేతిలోకి బంతి వెళ్లడం, దానితో అతడు మెరుపువేగంతో స్టంపింగ్ చేయడం చూస్తే కార్ల్ హూపర్ ఎలా ప్రతిస్పందిస్తాడు? ఈ బుడతడిని అవుట్ చేస్తే విజయం మాదేనని విర్రవీగిన ఇంగ్లండ్‌ను దాదాపు మూడున్నర గంటలపాటు ప్రతిఘటించి విజయం దక్కకుండా చేస్తే ఇంగ్లండ్ కెప్టెన్ నసీర్ హుస్సేన్ ప్రతిస్పందన ఎలా ఉంటుంది? గెలుపు తప్పిపోయినందుకు కొంత నిరాశ కలిగి ఉండవచ్చుగానీ, కెప్టెన్, సాటి క్రీడాకారులు క్షణంలో ఈ విషయం మరిచి పార్థివ్‌ను అభినందించడం చూస్తుంటే పులకించని భారత క్రీడాభిమానులుంటారా? ఇలా చెప్పుకుంటూ పోతే అంతం ఉండదు. వికెట్‌కీపింగ్ చేయడంతో పాటు బ్యాటింగ్ సామర్థ్యంగల క్రీడాకారుని కోసం భారత జట్టు చాలాకాలంగా అన్వేషిస్తోంది. చివరకు పార్థివ్ దొరికాడు. నింపాదిగా ఉండేతత్వం, బ్యాట్స్‌మెన్ ధోరణి పసిగట్టే నేర్పరితనం, బంతిని వెంటాడే పట్టుదల, వికెట్ల వెనుక చురుకుగా కదలికలు అతనిలో మేలైన లక్షణాలు. మెరుపువేగంతో బంతిని అందిపుచ్చుకునే సామర్థ్యం, త్వరితగతిని ఆలోచించగల నేర్పరితనం మంచి వికెట్‌కీపర్‌కు ఉండాల్సిన లక్షణాలు. ఇవన్నీ పార్థివ్‌లో మూర్తీభవించి ఉన్నాయి. ఇందువల్లనే అతడు అందరి అభిమానాన్ని చూరగొంటున్నాడు. న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరిగిన మొదటి క్రికెట్‌టెస్టులో అతడు బ్యాటింగ్ చేసిన తీరు చూడముచ్చటగా ఉంది. షేన్ బాండ్ విసురుతున్న అగ్నిగోళాల వంటి బంతులను అతడు ఎదుర్కొన్న తీరు అందరి ప్రశంసలు చూరగొంది. దీంతో ఓపెనర్‌గా అతణ్ణి పంపాలనే సూచనలు ప్రారంభమయ్యాయి. ఏమైనా అతడు సమీప భవిష్యత్తులో ఓపెనర్‌గా దిగినా ఆశ్చర్యపోనక్కరలేదు. 2001 జనవరిలో చెన్నయ్‌లోని చిదంబర్ స్టేడియంలో భారత్, ఇంగ్లండ్ అండర్-19 టెస్ట్ మ్యాచ్ జరిగింది. దీనిని అతడు ప్రెస్‌బాక్స్ నుండి తిలకించాడు. భారత జట్టు తరఫున ఆడాలని ఆ మ్యాచ్ చూస్తుండగానే కోరిక కలిగింది. ఆ మ్యాచ్‌లో అజయ్ రాత్రా వికెట్‌కీపర్‌గా ఉన్నాడు. 16 మాసాల వ్యవధిలోనే పార్థివ్ ఆశలు ఫలించాయి. ఒత్తిడిని ఎదుర్కోవడంలో అతడికి అతడే సాటి. అండర్ 15, 17, 19 స్థాయిల్లో అతడు ఆడాడు. అయితే అతడు కనీసం ఒక్క ఫస్ట్ క్లాస్ మ్యాచ్ కూడా ఆడకపోవడం ఆశ్చర్యమనిపిస్తుంది. అతిపిన్న వయసులో పార్థీవ్‌ను అంతర్జాతీయ రంగంలోకి దింపడం మంచిది కాదని మాజీ స్టంపర్ సయ్యద్ కిర్మాణీ పేర్కొన్నారు. అతనిని నడిసముద్రంలో పడవేశారని, సురక్షితంగా బయట పడేందుకు అతడు దిగ్విజయంగా కృషి చేస్తున్నాడని కిర్మాణీ ప్రశంసించాడు. రైజింగ్ బంతుల విషయంలో అతడు కొంత ఇబ్బంది ఎదుర్కొంటున్నాడని కిర్మాణీ సూచించాడు. అతడు ఢాకాలో 2000 లో జరిగిన ఆసియాకప్‌లో భారత్ అండర్-17 జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇదే తనకు అవకాశాల తలుపులను తెరిచిందని పార్థీవ్ తెలిపాడు. ఇంగ్లండ్‌లో పర్యటించే భారత జట్టులో పార్థివ్ పటేల్‌కు అవకాశం కల్పించి సెలెక్టర్లు తెలివిగా వ్యవహరించారు. ట్రెంట్ బ్రిడ్జ్‌లో జరిగిన రెండో టెస్టులో అతనికి అవకాశం లభించింది. దీనిని అతడు సద్వినియోగం చేసుకున్నాడు. అవసరమైతే తానూ షాట్లు కొట్టగలనని పార్థీవ్ కొల్‌కతాలో విండీస్‌తో జరిగిన టెస్టులో నిరూపించుకున్నాడు. కిర్మాణీ తరువాత కొంతకాలం కిరణ్ మోర్ వికెట్‌కీపింగ్ బాధ్యతలు నిర్వర్తించాడు. తరువాత నయన్ మోంగియా వచ్చాడు. సీనియర్లతో వచ్చిన అభిప్రాయభేదాలు అతని క్రీడాజీవితానికి తెరదించాయి. తరువాత వచ్చిన దీప్‌దాస్‌గుప్తా బ్యాటింగ్‌లో ఫరవాలేదనిపించుకున్నా వికెట్‌కీపింగ్ పేలవంగా ఉండటంతో నిలదొక్కుకోలేక పోయాడు. అజయ్‌రాత్రా వికెట్‌కీపింగ్‌లో రాణించినప్పటికీ బ్యాటింగ్‌లో వరుసగా విఫలం కావడంతో బ్యాటింగ్‌కూడా చేయగల మరో వికెట్‌కీపర్ కోసం అన్వేషణ జరపాల్సి వచ్చింది. ఇందులో లభించినవాడే పార్థీవ్. వికెట్‌కీపింగ్‌లో అందరి ప్రశంసలు చూరగొంటున్నాడు. హర్భజన్, కుంబ్లే అతని వికెట్ కీపింగ్‌ను అనేకమార్లు ప్రశంసించారు. రోడ్నీ మార్ష్, బాబ్ టేలర్‌ల ప్రత్యేక ప్రశంసలు అందుకున్నాడు. అవకాశం కోసం కాచుక్కూర్చోడమే వికెట్ కీపర్ కర్తవ్యం. ఇందుకు ఎంతో ఓరిమి కావాలి. ఇది తనకు ఉందని పార్థీవ్ నిరూపించుకున్నాడు. బ్యాటింగ్‌ను మరింత మెరుగు పరచుకుంటే అతడు భారత జట్టులో పదికాలాల పాటు ఉంటాడు. ఇలా జరుగుతుందని ఆశిద్దాం. గుడ్‌లక్ పార్థీవ్! ★

స్వర్గ క్షేత్రాళం

రుక్మిణి

(గత వారం తరువాయి)

ఒకనాటిరాత్రి–

"రావే రా! నా పనితనం చూపిస్తా ఏం? నేనేమైనా చాతకాని మగవాడ్ననుకున్నావె? నన్నే తీసిపారేస్తివి గదా... రా.. మాది మారోజు వంశమే! మా తాతముత్తాతలు ఈ పరగణానిండా గుళ్లల్ల దేవతా విగ్రహాలు తయారు చేసి ప్రతిష్టించిన మహాగొప్ప.వాళ్ళే! పనివాండ్లే!"

రెక్క బుచ్చుకొని బరబరా మధ్య చీకటి గదిలోనికి లాక్కెళ్ళగానే – అలివేలు కళ్ళు చికిలించి చూసింది. ఆ మిరుమిట్లు గొలిపే కాంతి.. కోదండరాముడు.. సీతాసమేతంగా... కొలువుదీరిన మహాద్భుత దృశ్యం! పంచలోహాలను కరిగించి, పంచప్రాణాలుగ్గబట్టి.. పదిరోజులు ఏకబిగిన మల్లాచారి చూపించిన పనితనానికి అలివేలుకు మూర్ఛవచ్చినంత పనయ్యింది.

"చూస్కో... చూడవే.. ఇదీ నా చేతి పనితనం. మా వంశం నాకందించిన వరం! అయ్యో! శ్రీరామచంద్రా... సీతావల్లభా.. దుష్టజన శిక్షకా.."

ఎందుకో మల్లాచారి తల ఆ అడుగున్నర ఎత్తు విగ్రహాల ముందు నాలుగు బాదులు బాది విపరీతంగా ఆయాసపడి వెక్కివెక్కి ఏడుస్తుండగా అలివేలు మనసంతా గందరగోళంలో చిక్కుకుని, విలవిల్లాడిపోతుండగా ఆ చీకటి గదిలోనుండి.. ఉక్కలో నుండి చల్లటిగాల్లోకి రెప్పరెపలాడుతూ వచ్చి చిన్న జామచెట్టు కింద కూలబడి రెండు చేతుల్లో మొహం దాచుకుంది!

దూరంగా ఊరిబయట నక్క ఓటి వికృతంగా ఊళవేసి ఊరుకుంది! లోపల విగ్రహాల ముందు మల్లాచారి మగతగానే పడి వున్నాడు.

అలివేలు నిశ్చయానికి వచ్చిన దాన్లానే లేచి నుంచుంది!

☆ ☆ ☆

మల్లాచారి భార్య అలివేలు పెద్దవెంకటరెడ్డి గారి చిన్న కొడుకు ఆదిరెడ్డితో హైదరాబాద్ ఉడాయించిందని ఆ పల్లెటూర్లో పదిమందీ.. పదిచోట్లా బాహాటంగా చర్చ మొదలుపెట్టిన సమయానికి మల్లాచారి తనింటి మధ్యగదిలో శ్రీఆంజనేయస్వామి విగ్రహానికి రూపకల్పన చేస్తున్నాడు.

అప్పటికి వారం రోజుల్నుండీ ఆ వార్త ఆ ఊర్లో నానీగానీ పాతబడే దశకు చేరుకుంది. ఉదయం సాయంత్రాలు మాత్రం ఓ గంటసేపు మల్లాచారి ఊరిబయట చెరువుగట్టూ... చింతలతోపూ.. తాటి వనంలో తిరిగినంతసేపు తిరిగి కాళ్ళు తీటబాసి – ఉన్నూరని పెంకుటింటికీ – చీకటి గదికీ చేరుకునేవాడు.

అలివేలు జాడచెప్పమని చెట్టూ.. పుట్టనూ అడిగి ఏం లాభం? ఏ తుమ్మెదా ఏ రెమ్మా మాత్రం ఏం చెబుతాయి! మల్లాచారికి లోకమంతా శూన్యమే అనిపించింది!

అయితే–

పట్టువదలని విక్రమార్కుడిలా... ఆంజనేయస్వామి విగ్రహం పని మాత్రం వదలకుండా కానిస్తూనే వున్నాడు! అవునూ–? సుందరాకాండలో అసలు హీరో ఈ మహానుభావుడే కదూ! సీతమ్మ కోసం అగాధాలు... సప్తమహాసముద్రాలూ గాలించి గాలించి చివరికి అశోకవనంలనే గదా దొరకబుచ్చుకుంది? అవును.. అవునూ.. అంతే! అయితే అపుడేం జరిగిందీ? రాక్షసమూక పట్టుకుని రావణాసురుని కొలువులోనికి బరబరా లెక్కెళ్ళి ఏం చేశారు? అణగదీసి తోకకు బాగా పాతగుడ్డలు బిగించి – నూనెపోసి మరీ నిప్పటించలేదూ? మంటలు మండించలేదూ?

తోకమంటలు.. టాం....

టాం... టాం...!"

మల్లాచారి ఆ పూనకంలో అడ్డదిడ్డమైన గంతులు వేసి ఏ తెల్లవారుఝామునో నిద్రలోకి జారుకున్నాడు.

మరో రెండు రోజుల తర్వాత అనుకున్న విధంగా నిర్ణయించుకున్న సుముహూర్తానికే తెల్లడొక్కు కారూ.. దాన్లోనుండి పాపారావూ.. ప్రభృతులూ బిలబిలమని దిగి మల్లాచారిని చుట్టుముట్టేశారు. మధ్యగదిలో చీకట్లో కళ్ళు చికిలించి విగ్రహాలను చూసి మూర్ఛపోయినంత పని చేసి కళ్ళు మిలమిల తాటించారు.

"అది సరెగాని బాసా! ఈ హనుమంతుడి తోకేంది? చుక్కల్లోకే నిక్కిచూస్తుందీ? అరె.. దాని చివర పూరాగా మొండిబారి గొండచిలువ పాంలా నిగదీసిందేం కథ?"

నోరంతా వెళ్ళబెట్టి రామలింగం రుసరుసలాడాడు!

"ఓరి పిచ్చివెధవల్లారా! అసలు మీ పాడుపాచి మొహాలకు రామాయణం ఎప్పుడైన చదివార్రా? అసలు హరికథయినా విన్నారా!" మల్లాచారి నిలదీశాడు.

"సుందరకాండ చదవండ్రా! అది చదివినా. విన్నా... మీ సకల పాపాలూ హరించి మీరు తరించిపోతారు!" మల్లాచారి దిగులుగా బాగా పెరిగిన గెడ్డాన్ని గోళ్ళతో గీక్కుంటూ అన్నాడు.

"సుందరాకాండ సంగతి వదిలెయ్!

ముందు వీటిని పాతిపెట్టి – మకిలి పట్టే వికారకాండ సంగతి ఆలోచించండి!" పాపారావు ప్లాను ముందుకు తెచ్చాడు.

"అయినా ఆ తోక... తో..కే!" రామలింగం గొణిగాడు.

"ఒరే సీతమ్మ తల్లిని వెదికినపుడేం జరిగిందీ? అశోకవనం ఎట్లా తగలబడిందీ? మల్లాచారి మళ్ళా చిరతల రామాయణం పంథాలో చిందులకు తగులుకున్నాడు. అయితే ఆ ఆత్రంల దాన్ని పట్టించుకుని ప్రశంసించే తీరికెవరికీ లేదుమరి!

"ఒరే పాండ్య... చోళ రాజులు కాలంలో హనుమంతుల వారి తోక ఇట్లానే వుండిందీ.. అని మనంగానీ తగులుకుని నమ్మబలికామా.. వీటి ధర మరికాస్త పెరుగుతుంది! జర్మనీ వాడికీ... జపాను వాడికీ సుందరాకాండ సంగతిగాని చెపితే రెండు చెవులూ కోసి ఇక్కడే పారేసి మరీ వీట్ని ఎగరేసుకుపోతారు.. పట్నంద్రా!"

తర్వాత వాటిని బిగుతుగోతాల్లో బిగించడం.. రెండు నిలువుల లోతుల్లో ఉప్పు–సున్నం కలిపి పాతేయడం, అవికాస్తా మకిలీ... చిలుమూ పట్టి ఆనమాలు మాత్రం బహుసుందరంగా మిగిలివయసు మాత్రం మహా ముదనష్టంగా పెరిగిపోయినట్లు తయారవడంతో, ఎవడ్నయినా ఒకడ్ని దొరకబుచ్చుకుని బేరసారాలు మాట్లాడు – చేతులు మార్చుకుని.. రొక్కం అందుకుందామనే అదుర్దాలో అర్ధాంతరంగా బస్టాండులో మూటతో సహా దొరికిపోయి సోంరెడ్డి ఆస్థానంలోకి నెట్టబడడం అదంతా వేరే విషయం!

☆ ☆ ☆

"ఒరే... నీ తైతెక్కలాపుతావా, లేదా? నాలుగు తగల్నిచ్చెయ్యనా?" మల్లాచారి మీద సీనియర్ యస్సయి సోంరెడ్డి విరుచుకుపడ్డాడు. ముగ్గురు ముద్దాయిలుగా పిలవబడి, ముద్దముద్దగా నలగ్గొట్టబడిన వారూ ఒక మూలన నిలబడి బిక్కుబిక్కుమంటూ చూస్తూ నించున్నారు. లోపలంతా కల్చరల్ హెరిటేజి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ జోరుగా సాగుతుంది కాబట్టి – ఎందుకైనా మంచిదని ముందు జాగ్రత్తగా సోంరెడ్డి సిబ్బందినంతా కనుసైగల్లోనే కాంపౌండు పరిధిలోనే వుండడానికి ఆర్డరు వేశాడు.

"అరె.. ఏ కేసుకైనా ఒకదారీ.. రూటూ.. క్లాజూ.. కారణం వుంటుందే.. దీనికి ఒక తలా తోకా..."

"గదె గదె... ఆంజనేలుగారి తోక మొండిబారిందని ప్రాచీన బార్కు పురాణంలోనే వుందిసార్.. దీనికి ఆధారాలన్నీ రంగూన్ రామాయణంలో.."

"షటప్!" బంగారయ్య మీదబడి సోంరెడ్డి బాదినంత పని చేశాడు.

"అసలు వీటి ఖరీదెంత? కొనే షరాబు రాస్కెల్ ఏడి? ఏరా.. అసలు పాయింటు.. మీకివి ఎక్కడా దొరకలేదని ఈ గెడ్డంగాడు గెంతులేస్తున్నాడు. పైగానెలరోజులు వాడే కష్టపడి ఆర్నెల్ల కిందటే తయారు

చేశాననీ అంటున్నాడు. మరివి చూస్తేనేమో అతి ప్రాచీన మురికి కళాఖండాలుగా కనిపిస్తున్నాయే! ఒరే గెడ్డంవాడా? నా బుర్ర పేలిపోతుందిరో! చెప్పు... అసలు నువ్ ఏ గుళ్ళో నుండి వీటిని టపామల్కని టకరాయించిందీ.. లగాయించిందీ..."

"గుడిలేదూ... గోపురం లేదూ.. ఆలులేదూ. చూలు లేదూ... అలివేలు లేదూ! అంతా సుందరాకాండం!" సోంరెడ్డి కోపాగ్ని నషాళం అంటడంతో మల్లాచారి డొక్కలో ఒక్కటీకు పీకేసరికి మల్లాచారి హాహాకారం చేసి ఓ మూలకు ఎగిరిపడిపోయాడు!

రాణాలో పరిస్థితి చాలా చిత్రంగా.. కదు గోప్యంగా.. మహారంజుగా వుంది.. ఒక్క గంట క్రితం అట్లా ఓ టింబక్టూవాడి కోటు జేబులో నుండో కోటి రూపాయల కట్టవచ్చి అట్లా పడిపోతుందనుకుంటే.. ఈ గెడ్డం స్వర్ణకారుడు... పెండ్లాం... అలివేలూ... రిపోర్టు సుందరాకాండం.. హనుమంతుడి మొండితోకా... కిరసనాయిలూ అని తగులుకుంటాడేంటీ?

లాభంలేదు – వీడు యమాడేంజర్! వీడు చెప్పే మాటల్ల ఏ మాత్రం సత్యం వున్నా కోటుకాదుకదా.. ఉన్న బూటు కూడా ఊడిపోతుందే? ఎట్లా?

"సార్!" పాపారావు వినయ విక్రమార్కుడి లెవెల్లో తలముందుకు జాపాడు!

"ఏరా? మరో రౌండుకానీ తగల్నిచ్చేదా?" సోంరెడ్డి ఉరిమాడు.

"అబ్బే అదేం అవసరం లేదూ.. అదే మన బేరం.. దాన్ని అట్లాగే వుంచేయండి! జపాను తుపాను టింబక్టూ కనికట్టు ఎవడూ కనిపెట్టలేడు... మేం వీట్ని ఇదుగో ఈ గెడ్డాం వాడితో తయారు చేయించింది నిజమే! నిలువుల లోతున ఉప్పేసి పాతిపెట్టి మకిలి పట్టించింది నిజమే! అయితే ఏంటటా? ఇపుడదంతా ఎవడిక్కావాలి? మీకా? మాకా? సుందరాకాండ సంగతి సుబ్బరంగా తుంగలో తొక్కి బేరానికి రెడీ అయిపోయి.. మీరూ.. మేమూ ఒక సెటిల్మెంటుకు వచ్చేస్తే పాయిరి."

సోంరెడ్డి బుర్ర స్పుత్నిక్... క్షిపణికన్న.... సూర్యకిరణం కన్నా అతి వేగంగా చకచకా పని చేసింది. 'వీడు చెప్పిందీ నిజమే! వీటి వయసు కట్టే ఉపాయం ఇంతవరకూ ఎవడూ ఖరాఖండీగా చెప్పనే లేదు. దానికో మీటా మీటరూ కూడా ఏడ్చి లేనేలేదు. ఊరికే వదిలేయడం కన్నా ఊకనైనా అమ్ముకుంటే నాలుగురూకలు రాలతాయి గదా! ఈ వెధవలకు అసలు ఏ నోబులో... గ్లోబులో ఫ్రైజివ్వాల్సిందే. మొత్తానికి పోలీసోడికన్నా బహుపకడ్బందీగా పథకం మాత్రం అల్లారుగదా వెధవల్లారా!' అని బుర్రంతా క్షణకాలం గజిబిజిగా మారిపోవడంతో సీనియర్ యస్సయి సోంరెడ్డి కాస్త గొంతు బాగా తగ్గించి "మరి ఈ సృష్టికర్త... సుందరాకాండ సుందరుడు... తోకపీకుడుగాడు.. వీడి సంగతేంట్రా? వీడు బయటపడి, తోకా తొండం.. అంటే మీ పీకలు తెగ్గోసి గోతాల్లో కుట్టి పారేస్తా, ఖబర్దార్!" అని లోగొంతులోనే భీకరంగా ఘీంకరించాడు.

"హమ్మో! అంతదాకా ఎందుకుసార్! వాడి ఒక్క పీకా తెగ్గోస్తే మరి పీడా పాయిరి! వాడూ – వాడి పనితనం అంతా పల్లంలో.. నిలువు గోతిలో పడి ొట్టుకుపోతుంది. అయినా ఇలాంటి అల్పవు ఖవలుండడమే వేస్టు! పనికిమాలిన చెత్త సరుకు! ఛ్ఛీ.. పురుషులందు కాకి పురుషులు వేరయా.. అబ్బో.. తైనా మీ రాజనీతీ... లాఠీ గుద్దుడూ.. మీ విగ్రహం... డంలో నిగ్రహం... విగ్రహం...పంచలోహం..."

"షటప్... ఒరే పాపారావ్! వాడ్నిట్లా షట్రా!" సోంరెడ్డి హుకుం జారీ చేశాడు.

పాపారావు అప్పటికే లేచి... నీరుగారి నోరు పెగలక గజగజా వణుకుతున్న మల్లాచారి పెడరెక్కలు విరుద్దునా... అని ఒకడుగు ముందుకు వేశాడు!

"ఏందీ.. మళ్ళా తోకలూ.. తొంబయ్యా.. అమ్మో... నా వల్లకాదు. నా అలివేలు లేదు.. నా కాలివేలు కూడా కదలదు!" మల్లాచారి లబలబలాడాడు. "ఎందాని వెదుకుదూ రామచంద్రా... సప్త సముద్రాల కావల మూడు నిలువుల ఉప్పు పాతరేసి కిలుం పట్టించినా నీకు సిగ్గులేదురా.. ఓరీ మారీచుడా! తోక తెగ్గోసినా పీక జులుం తగ్గలేదు తైతకతై...తైతై..."

సోంరెడ్డి తలపట్టుకున్నాడు. ముగ్గురు ముద్దాయిలూ హడలిపోయి తలోమూల గోడలకు అతుక్కుపోయారు.

"ఒరే పనీపాట లేని పదాలు పాడావంటే పసరు పడిందాకా కోటింగ్ తప్పదు. చుప్ బద్మాష్! అరె వీడినోరు మూయించండిరా! రాణాను పిచ్చాసుపత్రి చేస్తే తిక్క వదలదీస్తా!"

మల్లాచారి దృష్టి టక్కున లాకప్పులోని పట్టాభిషేకం విగ్రహాల మీద పడంగానే ఒక్కసారి ఆగి – లపలప లెంపలు వాయించుకుని – మోకాళ్ళమీద దేక్కుంటూ లోపలదాకా వెళ్ళాడు.

"సార్ సార్ ఇదేసందు! లాకప్ తలుపులు

మూసిపారేస్తే ఆ పిచ్చోడిగోల ఆపచ్చు! లౌక్యంగా రామలింగం సలహా ఇవ్వడమేంటి.. ఒక్క గెంతులో బంగారయ్య లాకపు తలుపు మూసిపారేశాడు! "హమ్మయ్య! వీడి సంగతి సరేగాన్రా! బేరగాడూ... షరాబువాడూ టింబక్టూ రాస్కెల్ ఎక్కడ్రా?" సోంరెడ్డి మెదడ్లో నోట్లకట్టలు పరపరలాడిపోతున్నాయి.

"అలివేలూ. నా అందాల అలివేలూ.. నాపనితనం చూపిస్తానే.. అలివేలూ.. నా అలివేలూ!" లా కప్పులో నుంచి మల్లాచారి మంద్రస్వరంలో కూని రాగాలకు తగులుకున్నాడు.

"డంకన్ హోటల్‌కు కబురు చేయండి సార్! బ్రిటన్, ఫ్రెంచి.. ఢిల్లీ వాలాలు ఎవడో ఒకడు వీట్ని ఎగరేసుకుపోయి అంతర్జాతీయ మార్కెట్లో అమ్మేసుకుంటారు! మొత్తం డాలర్లలోనే పేమెంటు కావాలంటే సరి!" రామలింగం ఓ స్టూలు లాక్కుని కాస్తంత నదురుగా కూచుని సలహాలు చెప్పేస్తున్నాడు.

సోంరెడ్డి పొడుగు సిగరెట్టు వెలిగించి ఉల్లాసంగా ఊహాచిత్రాలకు తగులుకున్నాడు. ఇవాళ రాత్రివరకూ ఈ వ్యవహారం సెటిలయిపోవాలి! పైవాళ్ళకు తెలిస్తే తిలాపాపం... తలాపడికెడు అబ్బో! అదేం కుదరదు – ఈ వెధవల్ని తలా ఒక తన్ను తన్ని తగలేస్తే ఎవడిదారి వాడిదే – గోదారి!

"సార్... సార్!" మల్లాచారి లాకపు ఊచలకు వేలాడుతూ పిలిచాడు. సోంరెడ్డి తలకాయ తిప్పి వినుగ్గా చూశాడు. వీడ్ని తక్షణమే వదిలించుకోవాలి!

"చూడండి సార్ చూడండి. కళ్ళు మిటకరించి చూడండి! బాబూ చూడండి. మా తాత ముత్తాతల పనితనం. బంగారు బొమ్మల్నే కాదు. దేవతా మూర్తుల్నే కాదు. బంగారు బొమ్మల్లాంటి ఆడకూతుళ్ళందరికీ పేదా... ధనికా భేదం లేకుండా వడ్డాణం దగ్గర్నుండి కాలిమట్టెల దాకా మలచిన మా పనితనం. ఈనాడు మార్కెట్లో పనికిరానిదై పోయింది. కోట్ల...కోట్ల జంటలకు మంగళ సూత్రాలందించిన మా బతుకులు మట్టిలో కలిసిపోయినాయి! ఈ మార్కెటు మాయాజాలం ఒక్క విసురుతో మమ్మల్ని దిక్కులేని పక్షులను చేసింది గదా!"

అవున్సార్ మా పెల్లాం అలివేలు నా పనితనాన్ని ప్రశ్నించి నిలదీసింది. ఎక్కడ చూపించను నా పనితనం? మండే డొక్కల లోతుల్లోనా, పీక్కుపోయిన కండ్ల జీరల్లోనా.. ఎక్కడండీ నా వనితనం పనికివచ్చిందీ? ఇటులోకానికి అటు నా పెళ్ళానికీ పనికిరాని నా పనితనాన్ని ఇదుగో చూడండి మహారాజా... చూడండి... దేఖో... చూపించాను నా పనితనం... పనితనం!

పాపారావు బంగారయ్య లాకప్పులోని పాతటేబిలు మీదికి చూసి నిర్ఘాంతపడిపోయారు – అక్కడ పట్టాభిషేకం... ఆంజనేలు వారూ... వారి వాలం పత్తాలేదు... అసలేమీ లేవు!

సీనియర్ యస్సయి సోంరెడ్డి పూరాగా నోరు వెళ్ళ బెట్టేశాడు. టేబిలు మీద మూడు విగ్రహాల ముక్కలు చిందరవందరగా పడి వున్నాయి. – కాలుకుకాలు, కీలుకుకీలు.. కోదండం... మొండితోకా.. కిరీటం.. రత్నఖచిత రవ్వల హారం.. సీతమ్మోరి సిగపిన్నూ... అన్నీ అన్నీ.. ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా కలగా పులగమై కుప్పబడి వున్నాయి. ప్రతిదానికీ కీలకమైన జాయింట్లు.. స్క్రూలు.. మరలు పెట్టినాడేమో మల్లాచారి... ఏకీలుకు ఆకీలు ఊడబెరికి పట్టాభిషేకం విగ్రహాల సొంపును సోదిలోకి లేకుండా కుప్పకింద మార్చి పారేసినాడు. వాటిని కలిపి తిరిగి విగ్రహాల్ని అమర్చడం మల్లాచారి కాదు – ఆ బ్రహ్మదేవుడిక్కూడా సాధ్యం కాదు!

"నా పనితనం – మగతనం చూసినారు గదా బాబులూ... ఇంకా మా బుర్రా – చేతులూ పస్తున్నానే వున్నాయి. మా బతుకుల్ని బజారు మురిక్కాలవల్లోకి తోయకండి! మమ్మల్ని పనికిరాని వాళ్ళ క్రింద ఈ మార్కెటు మాయాజాలంలో... సంతలో సరుకు చేసి చులకన చేయకండి."

మల్లాచారి రొప్పుడూ... పిచ్చపిచ్చగా కేకలు పెడతూనే వున్నాడు. సోంరెడ్డి తెరిచిన నోరుమూసి కుర్చీలో అథాటున కూలబడి పోయినాడా... మరి ముగ్గురు ముద్దాయిలూ.. గడబిడగా పట్టాభిషేకం ముక్కల మీదికి ఎగబడి జుట్టుపీక్కుంటున్నారు! ★

పతంజలి సాహిత్య దర్శనం

పూర్వ వైభవాన్ని కోల్పోయిన రాజులు మారుతున్న పరిస్థితులను గ్రహించాక తమ పాతకాలపు దర్జాలను, ఆడంబరాలను ప్రదర్శించడంలోనూ – వేట, పేకాట వ్యసనంలో చిక్కుకుని ఉన్న ఆస్తులను అమ్ముకున్నా వాళ్ళ భేషజాలకు అంతు వుండదు. సరదా కోసం దేశీయ వైద్యాన్ని చేపట్టిన ఫకీర్రాజుగారు తన మిడిమిడి జ్ఞానంతో చేసిన వైద్య సహాయం వికటించి చివరకు అతడ్ని పోలీస్ స్టేషన్‌కు చేర్చి "రాజుగోరు" పరువు తీస్తుంది. రాచమర్యాదలు కూడా ఎంత తలతిక్కగా వుంటాయో "వీరబొబ్బిలి" తెలియజేస్తుంది.

రాజులలో వున్న ఎక్స్‌ప్రెషనిజం, హిపోక్రసీని మూనపాటి కృష్ణంరాజుగారి కథల్లో లీలగా చూశాం. కాని దాన్ని విస్తరించి నవలలుగా రాసిన ఘనత మాత్రం పతంజలిగారిదే. ఆ వర్గానికి సంబంధించిన జీవితాలను వ్యంగ్యంగా విశ్లేషించడంలో పతంజలి చూపిన నేర్పు అద్వితీయం. భూమి గుండ్రంగా ఉందని కొందరూ, బల్లపరుపుగా వుందని కొందరూ చేసిన వాదనల మీదుగా ఒక ఊరికి ఊరు కులాల వారిగా చీలిపోయి రాజకీయాలను నడిపి పోలీసుల బారిన పడి చివరకు పోలీసుల లాఠీలాగుందని తెలుసుకోవడం "గోపాత్రుడు"లో కనిపిస్తుంది. గ్రామస్థులనే కాదు, పోలీస్‌వాళ్ళు తలచుకుంటే న్యాయ వ్యవస్థనే ఒక ఆట ఆడించగలరని తెలిపే "పిలక తిరుగుడు పువ్వు" నవల మనకు షాక్ కలిగిస్తుంది.



కె.ఎన్.వై. పతంజలి రచనలు
ప్రచురణ : పతంజలి మిత్రమండలి, హైదరాబాద్; వెల : రు.240/-;
ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

అప్పన్న సర్దార్ రాష్ట్ర రాజకీయాల కుళ్లును వివరిస్తే, "నువ్వేకాదు" నవల రాజకీయాల్లో చోటు చేసుకున్న నేరపూరిత వాతావరణాన్ని తెలియజేస్తుంది. ముఖ్యమంత్రి కావడానికి అధికార పక్షంలో జరిగే రాజకీయ కుతంత్రాలు ఒకవైపు, తిరుగుబాటు చేయడానికి కూచున్న పోలీస్ వ్యవస్థ ఇంకోవైపు, ప్రతిపక్ష పార్టీకి చెందిన కేంద్ర ప్రభుత్వ కుట్రలను మరోవైపు వివరించిన "అప్పన్న సర్దార్" నవల కొందరు రాజకీయ నాయకుల దుర్మార్గాన్ని, మోసాల్ని చాలా చక్కగా వివరించింది. "నువ్వేకాదు" నవలలో ప్రధానమంత్రి రైలు ప్రమాదంలో పోగొట్టుకున్న 500 కోట్ల వజ్రాలను తిరిగి పొందడానికి నడిపిన మారణకాండ ఒక డిటెక్టివ్ నవలను మరిపిస్తుంది. ఈ నవలలో మొత్తం వ్యవస్థ అవినీతిమయం అయిందని తెలియజేయడం బానే వుంది. కాని ప్రధానమంత్రిని కూడా మామూలు క్రిమినల్ స్థాయికి దించేసి దేశాన్ని అమ్ముకునే వాడిలా చిత్రీకరించడం అన్యాయమే. ఈ రెండు నవలలు భ్రష్టుపట్టిపోయిన రాజకీయాలను, అవి కలుషితం చేసిన వ్యవస్థలను అద్భుతంగా చిత్రీకరించారు. పరోక్షంగా ఈ అన్ని నవలల్లో పోలీస్ వ్యవస్థ విశ్వరూపం కనిపిస్తుంది. డబ్బు, అధికారం వున్న వాడికి లొంగిపోయే పోలీసు వ్యవస్థ తనదైన న్యాయాన్ని ఆవిష్కరించడంలో చూపే నిరంకుశత్వాన్ని చివరకు న్యాయాన్ని, మంత్రులను కూడా ధిక్కరించే విశృంఖలత్వాన్ని వివరించిన తీరు మనల్ని ఆశ్చర్యాందోళనలకు గురి చేస్తుంది. ఇంకోవైపు పోలీసు వ్యవస్థలో చోటు చేసుకున్న బానిస విధానాలను, వెట్టిచాకిరి, అణచివేతలను "ఖాకీవనం"లో వివరిస్తూనే, పోలీసులు కూడా సంఘటితమై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచిస్తాడు.

ఒకప్పుడు పత్రికలు జాతికి మార్గదర్శకాలుగా నిలిచాయి. కాని ఇప్పుడు అవి పెట్టుబడిదారుల చేతిలో బ్లాక్ మెయిల్ అస్త్రాలుగా మారిపోయాయి. విలువల కోసం పోరాడే ఎడిటర్లు, అంకిత భావంతో పని చేసే రిపోర్టర్ల శకం ముగిసింది. అందరికీ బ్రతుకు పోరాటమే. ఎలాగోలా సర్దుబాటు కాక తప్పదు. ఉద్యోగాలు, పై సంపాదనా తప్ప మానాభిమానాలకు తావులేదు. జర్నలిస్టులలో పెరిగిపోతున్న అవకాశవాద ధోరణులను, అక్రమ ఆర్జనను, తాగుబోతుతనం మొదలైన సకల విధ అవలక్షణాలను పతంజలి నవలల్లో కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించారు. పత్రికల వాళ్ళల్లో, పోలీసు వాళ్ళలో కూడా మహానుభావులుంటారని కూడా చూపించారు. కూపస్థ మండూకాల్లా బతికే కళాకారులు, పదాన్నభుక్కులుగా తయారైన మేధావుల అలసత్వాన్ని, నిష్క్రియా పరత్వాన్ని, ఒంటెత్తుపోకడలను "ఒక దెయ్యం ఆత్మకథ"లో ఎండగట్టారు. "ఒక దెయ్యం ఆత్మకథ" నవల శిల్ప రీత్యా విశిష్టమైనది. పంచతంత్రం నడకను బోలిన ఈ నవల లోకరీతులను వివరించడంలో సక్సెస్ కాగలిగింది. పనిలేని రాజులకు ఎందుకు పనికిరాని కుక్క "వీరబొబ్బిలి". బొబ్బిలి దృక్పథంలో నడిచిన ఈ నవల వ్యంగ్యానికి పరాకాష్ట. "గోపాత్రుడు, పిలక తిరిగిన పువ్వు" వస్తురీత్యా, శిల్పరీత్యా ఆణిముత్యాలనదగ్గ నవలలు. ఈ రెండు నవలలు రావిశాస్త్రిగార్ని గుర్తు చేసినా, పతంజలి స్వంతముద్రను కలిగి వున్నాయి. ఈ నవలతో పాటు చివరగా జంతువుల గురించి, వేట గురించి ఎన్నో విషయాలను తెలియజేస్తాయి. అల్లం శేషగిరిరావు మాత్రమే కాదు పతంజలి కూడా వేట కథలు బాగా రాయగలరని ఈ కథల ద్వారా తెలుసుకుంటాం. ఎటొచ్చీ ఈ కథల కేన్వాస్ చాలా చిన్నది. అంతే. హాస్య వ్యంగ్యాలను పండించడంలో పతంజలికి సాటి వేరెవ్వరూ లేరు. అవన్నీ వివరిస్తే అదో గ్రంథంలా తయారవుతుంది. పాఠకులే స్వయంగా వాటిని చదివి ఆనందించవచ్చు. పతంజలి రచనలను సమగ్ర సంకలనంగా వేశారంటే కొంపదీసి వారు అస్త్రసన్యాసం చేయడం లేదు కదా అని పాఠకులు అనుమానించినా ఆశ్చర్యపోవలసిన పని లేదు

– కె.పి.అశోక్‌కుమార్

ప్రాకారం



ఇది వ్యాఖ్యాన దీర్ఘ కవిత. నిజంగానే ఇది వ్యాఖ్యాన కవిత. స్థూలంగా చెప్పాలంటే ఇది వర్తమాన, సాహిత్య విచ్ఛిన్న బద్నాం వాతావరణాన్ని వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తుంది. కవికి నిషిద్ధ వస్తువంటూ ఏదీ లేనట్లు ఒక కవితలో ఒకే వస్తువంటూ కూడా ఏమీ ఉండదు. ఈ దీర్ఘ కవితలో ఉన్న 16 సభల్లోనూ 16 విషయాలంటూ ఉండవు. ఇవి దేనికది విడివిడిగా పొడిపొడిగా భౌతికంగా మనకు కనిపించినప్పటికి బౌద్ధికంగా ఒక అంతస్సూత్రంలో మనకి అనేక విషయాలను అవగాహనకు తెస్తాయి.

బద్నాం
రచన : ఆశారాజు; వెల : రూ. 15/-,
ప్రతులకు : ప్రజాశక్తి , విశాలాంధ్ర బుక్‌హౌస్‌ల అన్ని బ్రాంచీలు; దిశ పుస్తక కేంద్రం, నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్

ఈ నవలా రచయిత జోకిస్ట్‌గా, కార్టూనిస్ట్‌గా, కథా రచయితగా, వ్యాస కర్తగా పరిచితులే. ఇది రచయితకు తొలి నవల. ఇటీవలి కాలంలో జరిగిన ఒక యదార్థ సంఘటనను తీసుకొని ఈ నవలను రచించినట్లు రచయిత పేర్కొన్నారు.

ప్రేమపోరాటం
రచన : చలపాక ప్రకాష్; వెల : రూ. 35/-,
ప్రతులకు : సి. హెచ్. కృష్ణప్రియ, 1-4/3-36, విద్యాధరపురం, సంజయ్‌గాంధీ కాలనీ, విజయవాడ; విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు;

హైకూ మాట్లాడదు చిత్రిస్తుంది. నాకు సంతోషంగా ఉందనో, విచారంగా ఉందనో చెప్పదు. వాటిని పదచిత్రాల ద్వారా వ్యక్తీకరిస్తుంది. ఆ పద చిత్రాలు ఆయా అనుభూతుల్ని మనలో రేకెత్తిస్తాయి.

సంపెంగ లోలకం
రచన : డి. రూప్ కుమార్; వెల : రూ. 20/-,
ప్రతులకు : శ్రీమతి డి. అరుంధతి, ఇ.నెం. 5-5-212/5, ఫ్లాట్ నెం. 102, సాయి... అపార్ట్‌మెంట్స్, పటేల్‌నగర్, నాంపల్లి, హైదరా